సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



108 రకాల నైవేద్యాలు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేటలోని ఆర్యవైశ్య సంఘం వినాయకునికి మంగళవారం 108 రకాల నైవేద్యాలతో పూజలు చేశారు.



రాజన్న సేవలో ఐఏఎస్

వేములవాడ: జిల్లా ఎన్నికల పరిశీలకులు సి.సుదర్శన్‌రెడ్డి మంగళవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ తదితరులు ఉన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి



ఆందోళన చేస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు

కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కోనరావుపేటలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ థర్డ్‌పార్టీ వ్యవస్థను రద్దు చేసి డిపార్ట్‌మెంట్ నుంచి డైరెక్ట్‌గా నియమించి కనీస వేతనం ప్రతీ నెల ఇప్పించాలని కోరారు. పదిహేనేళ్లుగా పనిచేస్తున్న తమను సీఆర్టీలుగా మార్చాలని, సీనియారిటీ ప్రకారం ఇన్‌స్ట్రక్టర్లనే సీఆర్టీలుగా నియమించాలని కోరారు. లకావత్ తిరుపతి, అజ్మీరా రాజు, లకావత్ రవి, గుగులోత్ కృష్ణవేణి, బానోత్ మదన్‌లాల్, శ్యామల, ఊర్మిళ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



పోలింగ్‌స్టేషన్లను పరిశీలిస్తున్న అబ్జర్వర్

వేములవాడరూరల్: వేములవాడ మండలం వట్టెంల, నాంపల్లివార్డుల్లోని పోలింగ్‌స్టేషన్లను అబ్జర్వర్ సుదర్శన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. అక్కడ ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్డీవో మధుసూదన్‌గౌడ్, తహసీల్దార్ సుజాత, సూపర్‌వైజర్ రవళి ఉన్నారు.

'పది'లో ఉత్తీర్ణతశాతం పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చీర్లవంచ జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఐఎఫ్‌బీ ప్యానెల ద్వారా బోధన జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అమలుతీరును పరిశీలించారు. పదోతరగతి ఫలితాలలో విద్యార్థుల ఉత్తీర్ణతశాతం పెంచేలా కృషి చేయాలన్నారు.

జిల్లాలో కేంద్ర బృందం సర్వే



వెంకట్రావుపల్లి జీపీలో బృందం సభ్యులు

బోయినపల్లి(చొప్పదండి): పంచాయతీరాజ్ విభాగాల్లో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కొనసాగుతున్న ఆడిట్ ప్రక్రియ, ఆయా విభాగాల పనితీరుపై కేంద్ర బృందం వివరాలు సేకరిస్తోంది. వేములవాడ, బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్‌ఐఆర్‌డీ) బృందం పర్యటిస్తోంది. మండలంలోని వెంకట్రావుపల్లిలో కేంద్ర బృందం సభ్యులు శశిరేఖ, నాగలక్ష్మి పర్యటించి ఆడిట్ సంబంధిత వివరాలు తెలుసుకున్నారు. గత మూడేళ్లుగా జరుగుతున్న ఆడిట్ తీరు తెలుసుకోవడంతోపాటు గ్రామపంచాయతీ, జెడ్పీ, ఎంపీపీ కార్యాలయాలకు వస్తున్న గ్రాంట్లు, వినియోగంపై ఆరా తీస్తున్నారు.

నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో బుధవారం కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన జిందం కళాచక్రపాణి మంగళవారం తెలిపారు. విద్యానగర్‌లోని విగ్రహం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పద్మశాలి సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు గాజుల బాలయ్య పాల్గొన్నారు.



ఇది సిరిసిల్ల పాతబస్టాండ్‌లోని బస్సులు నిలిపే స్థలంలో బైక్‌లు నిలపడంతో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో బస్సులు వచ్చిపోయే బస్టాండ్ ప్రాంగణంలో బైక్‌లు నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్‌ప్లేస్ లేక వాహనదారులతోపాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

వరుసగా బైక్‌లు నిలిపిన ఈ ప్రాంతం నేతన్నచౌక్ సమీపంలోని కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి. ఇక్కడ దుకాణ సముదాయాలు, హోటళ్లు ఉన్నాయి. కొన్ని దుకాణాలకు సెల్లార్లు ఉన్నా వినియోగించడం లేదు. ఇక్కడికొచ్చే కస్టమర్లు తమ వాహనాలను రోడ్డుపై నిలిపి వెళ్తున్నారు. ఆటోలను సైతం రోడ్డుపైనే నిలుపుతుండడంతో అటు వైపు వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.





ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడ రాజన్న ఆలయం ఎదుట ఇలా బైక్‌లను పార్కింగ్ చేయడంతో భక్తులకు, వచ్చి పోయే వాహనాలకు ఇబ్బందిగా మారింది. రాజన్న ఆలయ సమీపంలో బైక్‌ల కోసం స్పెషల్ పార్కింగ్ ప్లేస్ లేక ఇలా గుడి ఎదుట నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది.

పార్కింగ్ పరేషాన్

- సిరిసిల్ల, వేములవాడల్లో పార్కింగ్‌స్థలాలు లేక తిప్పలు
- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- చలాన్‌లు విధిస్తున్న పోలీసులు
- ఆందోళనలో వాహనదారులు

సిరిసిల్లఅర్బన్/వేములవాడఅర్బన్: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీ కేంద్రాల్లో రోజురోజుకు ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. వాహనాల రాకపోకలు పెరగడం.. రోడ్ల విస్తరణ చేపట్టకపోవడం.. షాపింగ్‌కాంప్లెక్స్‌ల వద్ద సెల్లార్లు ఉన్నా ఇతర వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. సిరిసిల్లలోని బస్టాండ్, గాంధీచౌక్, అంబేడ్కర్‌చౌరస్తాలతోపాటు వేములవాడలోని రాజన్న ఆలయం, భీమన్నగుడి, బద్దిపోచమ్మ ఆలయాల వద్ద పార్కింగ్ ప్లేస్‌లు లేక వాహనాలను ఎక్కడ నిలపాలో తెలియక రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతోబ ఇటు స్థానికులతోపాటు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా కేంద్రంలో తీవ్ర ఇబ్బందులు

సిరిసిల్ల జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి వివిధ అవసరాలకు వచ్చే వారి రాకపోకలతో వాహనాల రద్దీ పెరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం సిరిసిల్లకు వస్తుండడం.. బిజినెస్ పరంగా అభివృద్ధి చెందడంతో రాకపోకలు పెరిగాయి. వివిధ అవసరాల కోసం వస్తున్న వారు తమ వాహనాలను నిలిపేందుకు ప్రత్యేక స్థలాలు లేక షాపింగ్‌కాంప్లెక్స్‌లు, హోటళ్ల ముందు రోడ్లపైనే నిలుపుతున్నారు. ఇలా రోడ్లపైనే వాహనాలు నిలుపుతుంటే ట్రాఫిక్ పోలీసులు చలాన్‌లు విధిస్తుండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్, అంబేడ్కర్‌చౌక్, పాతబస్టాండ్, పెద్దబజార్, మార్కెట్ ఏరియా, వెంకంపేట, భావనఋషినగర్, గోపాల్‌నగర్ ప్రాంతాల్లో నిత్యం వావానాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులపై ఎక్కడి చూసిన వందలకొద్దీ బైక్‌లను నిలిపి ఉంచుతున్నారు.



రాజన్న గుడి ఎదుట నిలిపిన వాహనాలు

వేములవాడలో రోడ్లపైనే పార్కింగ్

ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడలోని రాజన్న గుడి చెరువు ప్రాంతంలో పార్కింగ్‌ప్లేస్ ఉంది. కానీ అక్కడ ఆలయానికి వచ్చే భక్తుల భారీ వాహనాలు మాత్రమే నిలుపుతుంటారు. పట్టణంలో బైక్‌లు నిలపాలంటే స్థలం లేదు. దుకాణాల ముందు బైక్‌లు పార్కింగ్ చేయడంతో మరో వాహనం రోడ్డుపై వెళ్లడం కష్టంగా మారింది. బ్రిడ్జి నుంచి రాజన్నగుడి వరకు ఇరుకురోడ్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కడ పార్కింగ్ ప్లేస్ లేదు. రాజన్నగుడి నుంచి జగిత్యాల బస్టాండ్ వరకు, రాజన్నగుడి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు బైక్‌లను రోడ్లపైనే నిలుపుతున్నారు.

గుడి మెట్ల వద్ద పార్కింగ్

రాజన్న ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయ ప్రధాన ముఖద్వారం వద్ద ఇష్టానుసారంగా బైక్‌లు నిలుపుతున్నారు. ఆలయ పడమర ద్వారం మెట్ల వద్ద సైతం వాహనాలు నిలుపుతుండడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుడి చెరువు కట్టపైన పార్కింగ్‌ప్లేస్ ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో వాహనాలను అక్కడ నిలపడం లేదు.

పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి



జిల్లా కేంద్రంలో పార్కింగ్ స్థలాలు లేవు. పండుగ రోజుల్లో ఇబ్బంది పడుతున్నాం. సిగ్నల్స్ ఉన్న ప్రాంతంలోనూ వాహనాలు నిలుపుతున్నారు. పార్కింగ్ ప్లేస్ లేక దుకాణాల ఎదుట రోడ్లపైనే బైక్‌లు నిలుపుతుంటే పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు.

– ఎరవెల్లి నాగరాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి

దుకాణాల ముందు పార్కింగ్



వేములవాడలో ఇరుకు రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయాలంటే ఇబ్బందిగా ఉంది. బైక్‌లను దుకాణాల ముందు తప్ప ఎక్కడ పెట్టడానికి అవకాశం లేదు. పట్టణంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌ప్లేస్ కూడా ఏర్పాటు చేయాలి.

– భాస్కర్, సీలేస్ టైలర్, వేములవాడ

గుడిమెట్లకు అడ్డంగా నిలుపుతున్నారు



రాజన్న దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందిగా మారింది. గుడి మెట్ల వద్దనే బైక్‌లను పార్కింగ్ చేస్తుండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకుని గుడి మెట్ల వద్ద వాహనాల పార్కింగ్ తొలగించాలి.

– రాము, బొమ్మల వ్యాపారి, వేములవాడ

అవగాహన కల్పిస్తున్నాం



ట్రాఫిక్‌రూల్స్, పార్కింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తున్నాం. వాహనదారులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఇష్టానుసారంగా రోడ్లపై నిలపొద్దు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి.

– సముద్రాల రాజు, ట్రాఫిక్ ఎస్సై, సిరిసిల్ల

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం వేములవాడ డీఎస్పీ ఆఫీస్, టౌన్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డ్స్, సీడీఫైల్స్, ఫంక్షనల్ వర్టికల్స్ అమలు తీరు, నమోదైన కేసుల్లో ఎస్‌వోపీ ప్రకారం ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విధులల్లో అలసత్వం ఉండొద్దని, అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా పెంచాలని సూచించారు. వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 823 గణేశ్ విగ్రహాలు ఉన్నాయని, పట్టణంలో 180 విగ్రహాలు ఉన్నాయని, ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేయించాలని సూచించారు. మండపాల నిర్వాహకులతో మాట్లాడి బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచే శోభాయాత్రలు ప్రారంభమై.. అర్ధరాత్రి 12 గంటల్లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, సీఐలు కృష్ణకుమార్, కిరణ్‌కుమార్, ఎస్సైలు రమేశ్, ప్రశాంత్, దిలీప్ సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

చందుర్తి(వేములవాడ): నేరాల నియంత్రలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. చందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి మూడపల్లి క్రాస్‌రోడ్డు వరకు, చందుర్తి నుంచి లింగంపేట వరకు సింగరేణి సహకారంతో సీసీ కెమెరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ప్రారంభించారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై సిరిసిల్ల అశోక్ ఉన్నారు.

నేడు వేములవాడలో నిమజ్జనం

- రూ.10 లక్షలతో ప్రత్యేక ఏర్పాట్లు
- నాలుగు క్రేన్లు, 10 మంది గత ఈతగాళ్లు

వేములవాడ: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వేములవాడలో బుధవారంతో ముగియనున్నాయి. ఇందుకు మున్సిపల్ అధికారులు రూ.10 లక్షలు వెచ్చించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ బందోబస్తును పరిశీలించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి టెలీకాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ అన్వేశ్‌కు పలు సూచనలు చేశారు. గుడిచెరువు వద్ద ప్రత్యేక లైటింగ్, బారికేడ్లు, నాలుగు క్రేన్లు, 10 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

పోరాట చైతన్యానికి ప్రతీక ఐలమ్మ

- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్
- ఘనంగా జయంతి వేడుకలు



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: తెలంగాణ బహుజన పోరాట చైతన్యానికి ప్రతీకగా చాకలి ఐలమ్మ నిలుస్తుందని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఐలమ్మ జయంతి నిర్వహించారు. ప్రవీణ్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ముందున్న చాకలి ఐలమ్మ చూపిన ధైర్య, సాహసాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, ఆర్డీవోలు ఎస్.ఆనంద్ కుమార్, మధుసూదన్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాఘవేంద్ర, డీపీఆర్‌వో దశరథం, రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణంలో..

జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేసే చోట రజక సంఘం పట్టణ నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఐలమ్మ జయంతి వేడుకలకు జిల్లా కేంద్రం నుంచి ఆరు బస్సుల్లో తరలివెళ్లారు. రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ బస్సులు ఏర్పాటు చేశారు. రజక సంఘం పట్టణాధ్యక్షుడు దండు శ్రీనివాస్, కార్యదర్శి మహేందర్, దండు ఎల్లయ్య, చెప్యాల బాలరాజు, కాసర్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

- ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు సుదర్శన్‌రెడ్డి
- పోలింగ్ కేంద్రాలు పరిశీలన

సిరిసిల్ల: ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధం చేయాలని ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలు, ఓటరునమోదును మంగళవారం పరిశీలించారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. అర్హులను ఓటర్లుగా నమోదు చేస్తూనే డబుల్ ఓటర్లను, చనిపోయిన వారిని తొలగించాలని సూచించారు. వేములవాడ మండలం వట్టెంల, సిరిసిల్ల శివారులోని చిన్నబోనాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఎన్.ఆనంద్‌కుమార్, మధుసూదన్ ఉన్నారు.

స్వాగతం పలికిన కలెక్టర్

ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు సుదర్శన్‌రెడ్డికి కలెక్టర్ అనురాగ్ జయంతి కలెక్టరేట్‌లో స్వాగతం పలికారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2023 క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన సుదర్శన్‌రెడ్డితో తన చాంబర్‌లో సమావేశమయ్యారు. ఓటర్ల నమోదుపై సమీక్షించారు.



కలెక్టర్ అనురాగ్ జయంతితో సి.సుదర్శన్‌రెడ్డి

పేదల కల సాకారం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

- నేడు 'డబుల్' ఇళ్లు పంపిణీ చేయనున్న మంత్రి కేటీఆర్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గంభీరావుపేట(సిరిసిల్ల): ఇళ్లు లేని నిరుపేదల కల సాకారమవుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ గూడు నివ్వాలనే ప్రభుత్వ లక్ష్యం ఆచరణలోకి వస్తోంది. గంభీరావుపేటలో 272 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీకి సిద్ధం చేశారు. ఎస్సీ కాలనీలో 104, బీసీ కాలనీలో 168, నర్మాలలో 30, లింగన్నపేటలో 50, కోళ్లమద్దిలో 17 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేశారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ బుధవారం లబ్ధిదారులకు అందజేయనున్నారు.

ఫోర్‌లేన్ రోడ్డుకు మోక్షం

గంభీరావుపేటలో ఫోర్‌లేన్ రోడ్డుకు మోక్షం లభించింది. గ్రామశివారు నుంచి మూడు కిలోమీటర్ల మేర ఫోర్‌లేన్ రోడ్డు, డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

ఎట్టకేలకు హైలెవల్ వంతెన

గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరువాగుపై ప్రయాణికుల కష్టాలు తీర్చేందుకు హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.13.40కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు కూడా మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలి

అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరుతూ మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. ఇప్పటికీ అనేక గ్రామాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించలేదన్నారు. స్థలం ఉండి ఇల్లు లేని వారికి రూ.5లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు రూ.3లక్షలే ఇస్తామనడం సమంజసం కాదన్నారు. ఎస్సై మహేశ్ అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. సెస్ మాజీ మండల డైరెక్టర్ కొక్కు దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శులు కృష్ణకాంత్, మహేశ్, నాయకులు మేకార్తి శ్రీనివాస్, దేవయ్య, రాజిరెడ్డి, దేవేందర్, విగ్నేశ్, స్వామి, నరేశ్, ప్రవీణ్, దేవరాజు, రాకేశ్, సర్వోత్తం, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటన ఇలా..

గంభీరావుపేట మండలంలో బుధవారం మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం గంభీరావుపేటలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ప్రారంభించి, హైలెవల్ వంతెనకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించే బహిరంగసభలో ప్రసంగిస్తారు. కొత్తపల్లిలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం లింగన్నపేట, కోళ్లమద్ది, నర్మాలలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ప్రారంభిస్తారు.

కేటీఆర్‌కు రుణపడి ఉంటాం



మంత్రి కేటీఆర్ సహకారంతో గంభీరావుపేట మేజర్ పంచాయతీ ఎంతో అభివృద్ధి చెందింది. ఫోర్‌లేన్‌రోడ్డు, హైలెవల్ వంతెన, రూ.3కోట్లతో అత్యాధునిక కూరగాయల మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కేటీఆర్‌కు రుణపడి ఉంటాం. మంత్రి సహకారంతో మరింత ముందుకెళ్తాం.

– కటకం శ్రీధర్‌పంతులు, గంభీరావుపేట సర్పంచ్



వైభవంగా వినాయకుని నిమజ్జనం

వేములవాడ: రాజన్న ఆలయంలో తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జనం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం పెద్ద సేవలపై ఊరేగారు. ధర్మగుండంలో నిమజ్జనం చేశారు.



క్లుప్తంగా

అందరూ సంతోషంగా ఉండాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



గణనాథుడిని దర్శించుకుంటున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: సకల జనులు సంతోషంగా ఉండాలని వినాయకునికి మొక్కినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలో రాజన్న యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని మంగళవారం దర్శించుకున్న సందర్భంగా మాట్లాడారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సంగ స్వామియాదవ్, చిలుక రమేశ్, కనికరం రాకేశ్, కూర దేవయ్య, యూత్ సభ్యులు బోనాల శివ, గంగిశెట్టి మహేశ్, ఎడ్ల శ్రీనివాస్, ఆకుల నాగరాజు, జనగామ మహేశ్ ఉన్నారు.

లడ్డు, సిరాబోగంకు గిరాకీ

వేములవాడ: రాజన్న లడ్డు, సిరా భోగంకు గిరాకీ పెరిగింది. గణేశ్ నవరాత్రోత్సవాలు కొనసాగుతుండడంతో నిత్యం వంద వరకు లడ్డు, సిరా భోగాలు విక్రయిస్తున్నట్లు గోదాం ఇన్‌చార్జి, పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్ తెలిపారు. నెయ్యి ధర పెరిగిపోవడంతో లడ్డు, సిరాభోగం ధరలు పెంచాలని ఉన్నతాధికారులకు సూచించినట్లు చెప్పారు. వినాయక మండపాల నిర్వాహకులే ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు.

నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్

సిరిసిల్ల: ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించుకోవాలని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ పేర్కొన్నారు. ఇల్లంతకుంటలోని వైశ్యభవనంలో మంగళవారం వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. డీజేలు పెడితే కేసులు పెడతామని హెచ్చరించారు. తహసీల్దార్ జావెద్ అహ్మద్, ఎంపీడీవో మీర్జా, ఎస్సై సుధాకర్ ఉన్నారు.

విదేశీ కరెన్సీ ద్వారా రూ.19.34 లక్షలు



వేములవాడ: రాజన్నకు హుండీలలో వచ్చిన విదేశీ కరెన్సీని ఆర్‌బీఐ ఆథరైజ్డ్ డీలర్ ఫ్రీసైజ్ ఫోరెక్స్ అధికారులకు అప్పగించడంతో రూ.19.34 లక్షల ఆదాయం సమకూరింది. చైర్మన్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన కౌంటింగ్‌లో అకౌంట్స్ విభాగం ఏఈవో ప్రతాప నవీన్, పర్యవేక్షకులు సంతోష్, అడ్వయిజర్ ఆగంరావు, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, పీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజన్నకు ట్రాక్టర్ అందజేత

రాజన్నకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం కింద రూ.10 లక్షల విలువ గల ట్రాక్టర్‌ను మంగళవారం అందజేశారు.

అతి తక్కువ ఓటరు నమోదుపై కలెక్టర్ ఆరా

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలం గూడెంలోని ఓ పోలింగ్‌స్టేషన్‌లో అతి తక్కువ మంది ఓటర్లుగా నమోదవడంపై కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం ఆరా తీశారు. గూడెం బీఎల్వోలతో మాట్లాడారు. గ్రామంలో మూడు కేంద్రాలు ఉంటే.. ఒక్క కేంద్రంలో అతితక్కువ ఓట్లు నమోదయ్యాయని బీఎల్‌వోలు వివరించారు. ఇంటింటికి తిరిగి అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకున్నట్లు వివరించారు.



భుజంపై పెద్ద అట్టపెట్టెను మోస్తున్న ఈవిడ ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త. రెండు నెలల క్రితం స్కూల్‌కు సంబంధించిన ప్రీస్కూల్ కిట్లు తీసుకెళ్లాలని అధికారులు పిలిచి, సుమారు 25కిలోల బరువు ఉండే సామగ్రిని ఇలా అట్టపెట్టెల్లో పెట్టి ఇచ్చారు. వీటిని గోదాం నుంచి ఆటోలోకి ఆమెనే మోసుకెళ్లింది. విధి నిర్వహణలో ఇలాంటి కష్టమైన పనిచేస్తున్నారు అంగన్‌వాడీ కార్యకర్తలు.



ఈ ఫొటోలో ఉన్నది సీహెచ్ వరలక్ష్మి. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్–3 కేంద్రంలో పాతికేళ్లపాటు ఆయాగా పనిచేసింది. చాలా ఏళ్ల క్రితమే భర్త చనిపోగా అన్నీ తానై ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. హఠాత్తుగా ఆమె గత నెలలో అనారోగ్యానికి ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేక మృతిచెందింది. ఆమె మృతితో ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు. అంత్యక్రియలకు డబ్బులు లేకపోతే తోటి ఉద్యోగులు చందాలు వేసుకున్నారు. ఈ సంఘటన అంగన్‌వాడీ సహాయకుల దైన్య స్థితికి నిదర్శనం.

పని ఎక్కువ.. జీతం తక్కువ!

- ఆందోళనలో అంగన్‌వాడీలు
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్
- కొనసాగుతున్న నిరవధిక సమ్మె
- పట్టించుకోని ప్రభుత్వం



సిరిసిల్లలో పోరుబాటలో అంగన్‌వాడీ కార్యకర్తలు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేది అంగన్‌వాడీలు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్న వారికి సరైన గుర్తింపు దక్కడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పనికి తగ్గ వేతనం అందించాలని కోరుతూ కొన్నాళ్లుగా నిరవధిక దీక్షలు చేపడుతున్నారు. హక్కుల సాధనకు నిత్యం రోడ్డెక్కుతున్న వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు.. అందాల్సిన ప్రభుత్వ సాయంపై కథనం..

రెండు ప్రాజెక్టులు.. 587 సెంటర్లు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 587 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 27 మినీ అంగన్‌వాడీ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఆయా సెంటర్లలో 587 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 564 మంది సహాయకులు(ఆయాలు) పనిచేస్తున్నారు. వీరంతా రెండేళ్లు దాటిన పిల్లలకు ప్రీస్కూల్ చదువులు అందించడంతోపాటు గర్భిణులు, కిశోరబాలికలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తారు. ఇవి కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, వివిధ సర్వేలు చేపట్టడం, బీఎల్‌వోలుగా విధులు నిర్వర్తించడం అదనం. ఇంత చేస్తున్నా.. అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.13,650, ఆయాలకు రూ.7,800 పారితోషికం ప్రభుత్వం అందిస్తుంది.

అంగన్‌వాడీల డిమాండ్లు ఇవీ..

- శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగ విరమణ 60 ఏళ్లుగా నిర్ణయించాలి.
- టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి. పింఛన్, ఈఎస్‌ఐ వర్తింపజేయాలి.
- ఆయాలకు కనీస వేతనం రూ.20వేలకు పెంచాలి. అర్హతలు ఉన్న ఆయాలకు పదోన్నతులు కల్పించాలి.
- ఉద్యోగ విరమణ తర్వాత టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలి.
- పిల్లలకు రూ.5, గర్భిణులకు రూ.10 చొప్పున ఆరోగ్యలక్ష్మి మెనూ చార్జీలు పెంచాలి.

ప్రభుత్వం కనికరం చూపాలి



ప్రభుత్వం మాపై కనికరం చూపాలి. జీతాలు పెంచమంటే అంత్యక్రియల ఖర్చులు ప్రకటించడం బాధాకరం. అధిక పనిభారం గురించి అధికారులకు వివరించాం. ఏళ్లుగా వెట్టిచాకిరీ నుంచి విముక్తులను చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి.

– కల్లూరి చందన, అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

జీతాలు సరిపోతలేవు



టీచర్లు మీటింగ్‌లు, సర్వేలకు పోతే బడి బాధ్యతలు మేమే చూసుకుంటాం. నేను రూ.75 జీతంతో చేరిన. ఇప్పుడు చేతకావడం లేదు. ఇన్నాళ్లు సర్కారు ఆధీనంలో ఉద్యోగం చేసి ఏం లాభం. మాకు జీతాలు పెంచి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

– రంగు రాజవ్వ, అగ్రహారం, అంగన్‌వాడీ సహాయకురాలు

రాజన్న సేవలో అంధ విద్యార్థులు



రాజన్నను దర్శించుకున్న కరీంనగర్ ప్రభుత్వ అంధుల, బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

- ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విహారయాత్ర

వేములవాడ: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని ప్రభుత్వ అంధులు, బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు జిల్లా పర్యటకశాఖ ఆధ్వర్యంలో విహారయాత్రలో భాగంగా మంగళవారం వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చారు. ఆలయ అధికారులు విద్యార్థులకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. దాదాపు 150 మంది విద్యార్థులు, ఆశ్రమ పాఠశాల సిబ్బంది స్వామిని దర్శించుకున్నారు. జిల్లా పర్యాటకశాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఒక్కో సందేశంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం 'టూరిజం అండ్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్' అనే అంశంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మొదట ఎలగందులకోటను సందర్శించిన తర్వాత రాజన్న దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వారసత్వశాఖ, సహాయ సంచాలకులు నాయిని సాగర్, జాతీయ యువజన అవార్డు గ్రహీత, సామాజిక కార్యకర్తలు కిరణ్‌కుమార్, గజ్జెల అశోక్, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్స్ కె.నాగలక్ష్మి, భాస్కర్ పాల్గొన్నారు.

30న దివ్యాంగుల బస్‌పాస్ మేళా

- డిపో మేనేజర్ మనోహర్



ప్రగతిచక్ర అవార్డులు అందిస్తున్న డిపో మేనేజర్ మనోహర్

సిరిసిల్లటౌన్: జిల్లాలోని దివ్యాంగులకు ఈనెల 30న ప్రత్యేకంగా బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. స్థానిక కొత్త బస్టాండ్‌లో మేళా నిర్వహిస్తామని, సదరం సర్టిఫికెట్‌లో ఆర్థోవారికి 40 శాతం మించి వైకల్యం ఉండాలని, వినికిడి, దృష్టి లోపం 100 శాతం, మెంటల్ డిటార్డేషన్ 69 శాతం కంటే తక్కువ ఉండాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్సులు, సర్వీస్ చార్జ్ రూ.50లతో హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి మంగళవారం డిపోలో ప్రగతిచక్ర అవార్డులు అందజేశారు.

మాస్టర్ అథ్లెట్ రామానుజమ్మకు సన్మానం



రామానుజమ్మను సన్మానిస్తున్న గ్యాస్ ప్రతినిధులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రానికి చెందిన మాస్టర్ అథ్లెట్ టమటం రామానుజమ్మ(70)ను మంగళవారం చంద్రంపేట వద్ద ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సన్మానించారు. ఇటీవల మలేషియాలో జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెట్స్ పోటీల్లో దేశం తరఫున పాల్గొని రజత పతకం సాధించిన విషయం తెలిసిందే. పరమేశ్వరీ గ్యాస్ ఏజెన్సీ యజమానులు గడ్డం ప్రమీల, గడ్డం వేణు, గడ్డం సుమన్ రూ.10వేల ఆర్థికసాయం అందించారు. దేశం పేరును అంతర్జాతీయ వేదికపై నిలబెట్టిన రామానుజమ్మ గతంలో ఇండెన్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేశారని గుర్తుచేసుకున్నారు. 70 ఏళ్ల వయసులోనూ అలుపెరగకుండా పరుగుతీస్తున్న రామానుజమ్మను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ 57 ఏళ్ల వేడుకలు నిర్వహించారు. ఏజెన్సీ మేనేజర్ తాటిపాముల శివప్రసాద్, డెలివరీ బాయ్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచండి

- మెరుగైన వైద్య సేవలందించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



పేషెంట్లతో మాట్లాడుతున్న కలెక్టర్

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గంభీరావుపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యసేవలందిస్తున్న తీరును ఆరా తీశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం కోసం నూతనంగా నిర్మిస్తున్న భవనం పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వైద్యశాఖాధికారి సుమన్ మోహన్‌రావు, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, గంభీరావుపేట ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి, సృజన్ శ్రీవాస్తవ్ ఉన్నారు.

11 నెలలకే నూరేళ్లు

- గొంతువాపుతో చిన్నారి మృతి



గంగరాజు(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): గొంతువాపు వ్యాధితో బాధపడుతూ ఓ చిన్నారి(11నెలలు) మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన మాదాసు స్వామి–రేవతి దంపతుల కుమారుడు గంగరాజు(11 నెలలు)కు పుట్టినప్పటి నుంచి గొంతుకు సంబంధించిన వ్యాధి ఉంది. స్వరపేటిక చిన్నదిగా ఉండడంతో శ్వాస సంబంధమైన సమస్యతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు చిన్నారిని హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చూపెట్టగా గొంతుకు ఆపరేషన్ చేయాలని, ఐదేళ్ల వయస్సు వచ్చే వరకు ఆగాలని వైద్యులు సూచించారు. ఇంటికి తీసుకొచ్చిన తర్వాత శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కావడంతో మంగళవారం మృతి చెందాడు.

మంత్రి కొప్పుల దిష్టిబొమ్మ దహనం



మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ధర్మపురి: ఎస్సీల వర్గీకరణ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించేలా పోస్టర్ ఆవిష్కరించిన క్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ దిష్టిబొమ్మను ఎమ్మార్పీఎస్ నాయకులు దహనం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం మంత్రి వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కొప్పుల ఈశ్వర్ వర్గీకరణకు వ్యతిరేకంగా గోడ పత్రికలను విడుదల చేయడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని, మాదిగ సామాజిక వర్గానికి మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీల వర్గీకరణకు మూడు దశాబ్దాల నుంచి పోరాటం చేస్తున్నామని, మాల సామాజిక వర్గానికి మంత్రి కొమ్ముకాస్తూ మద్దతు తెలుపడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అన్ని వర్గాలకు సమ న్యాయం చేయాల్సిన మంత్రి ఒక వర్గానికి కొమ్ము కాయడం ఏమిటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడిగే హక్కు మంత్రి ఈశ్వర్‌కు లేదని, ఒకవేళ అడగాలనుకుంటే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరికెల్ల సతీశ్, ముల్కల శ్రీనివాస్, దూడ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తికి ఏడాది జైలు

సిరిసిల్లక్రైం: పార్కింగ్ చేసిన బైక్‌లను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి హిమబిందు మంగళవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన పడిగ లక్ష్మణ్ గత ఏప్రిల్ 26న కొత్తబస్టాండ్ వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగిలించడానికి యత్నించాడు. అదే నెల 18వ తేదీన సివిల్ హాస్పిటల్ వద్ద నిలిపిన బైక్‌ను దొంగతనానికి యత్నిస్తుండగా గమనించిన మల్యాలకు చెందిన పత్తిపాక శ్రీరామ్, సిరిసిల్లకు చెందిన గాజుల లవన్ సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో లక్ష్మణ్‌ను రిమాండ్‌కు పంపించారు. ఎస్సై తిరుపతి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్సై లావుడ్య శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి బైక్ దొంగతనానికి ప్రయత్నించిన పడిగ లక్ష్మణ్‌కు ఏడాది జైలు శిక్ష విధించినట్లు సీఐ ఉపేందర్ వెల్లడించారు.

మండెపల్లిలో పర్యటించిన డీఆర్డీవో



పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీనివాస్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లిలో మంగళవారం డీఆర్డీవో కె.శ్రీనివాస్ పర్యటించారు. ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామంలోని నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్, డ్రైవింగ్‌స్కూల్‌లో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కల సంరక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో పి.లచ్చాలు, ఏపీవో రాపోల నాగరాజు, టీఏలు లక్ష్మణ్‌గౌడ్, మనోహర్, సుమ, పలు గ్రామల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి



వేములవాడ: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం రాజన్న ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు చేశారు.

బాలిక కిడ్నాప్‌యత్నం కలకలం

- విచారిస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలో మంగళవారం ఓ బాలికను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారన్న సమాచారం కలకలం రేపింది. సిరిసిల్ల టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. స్థానిక శాంతినగర్‌లో 14 ఏళ్ల వయస్సు గల బాలికను కిడ్నాప్ చేసేందుకు కొందరు ప్రయత్నించినట్లు వచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధిత బాలికను పోలీసులు పలు ప్రశ్నలు వేయగా.. కిడ్నాపర్లు వచ్చిన కారుపై ఓ బోర్డు ఉందని తెలపడంతో.. డ్రైవింగ్ స్కూల్‌కు చెందిన వాహనంగా అనుమానిస్తున్నారు. దీంతో పట్టణంలోని పలు డ్రైవింగ్‌స్కూల్ నిర్వాహకులను పిలిచి వివరాలు సేకరించారు. కారులో వచ్చిన వాళ్లు నలుపు రంగు దుస్తులు వేసుకున్నారని తెలపడంతో ఆ కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. అయితే బాలిక తల్లిదండ్రుల మధ్య గొడవలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఎవరైన ఆమెకు హాని చేసేందుకు చూస్తున్నారా అనే కోణంలోనూ విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

బహుజనులు ఏకం కావాలి



మాట్లాడుతున్న విమలక్క



విగ్రహావిష్కరణలో ప్రజాప్రతినిధులు, నాయకులు

- చాకలి ఐలమ్మ ఆశయాలు కొనసాగిద్దాం
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క

ముస్తాబాద్(సిరిసిల్ల): సమసమాజ స్థాపనకు బహుజనులు ఏకం కావాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క కోరారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో పాల్గొని మాట్లాడారు. చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో బహుజనులు ఏకం కావాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాలకు ఊపిరిలూదిన ఐలమ్మ ఆశయాలను నేటితరం కొనసాగించాలని కోరారు. జయంతి వేడుకలు బహుజనుల భవిష్యత్తు దశ, దిశలను చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. త్వరలోనే బహుజనుల బతుకమ్మను 35 సంఘాలతో ఊరురా నిర్వహిస్తామని తెలిపారు. మద్యపానం, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా 'స్త్రీల కవాతు.. పూల కవాతు సాగిద్దాం' పేరుతో ప్రజాచైతన్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రజక సంఘం అధ్యక్షుడు నక్కదాసరి రవి, సర్పంచ్ కల్యాణి, ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీటీసీ లలిత, ఉపసర్పంచ్ నీరజ, మాజీ సర్పంచ్ ప్రేమ్‌చంద్, సర్పంచులు కిషన్‌రావు, రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, భాను, క్రాంతి, వేణు, మల్లారెడ్డి, నారాయణ, శ్రీనివాస్, కాసారం రాములు, పర్శరాములు, దేవరాజు, వెంకటేశ్, దేవయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆరోగ్య మహిళ'

- డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు



నేరెళ్ల పీహెచ్‌సీలో పరీక్షిస్తున్న వైద్యులు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్యమహిళ' కార్యక్రమాన్ని ప్రతివారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి స్పందన వస్తుందన్నారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ 526 పరీక్షలు, బ్రెస్ట్ 526, ఓరల్ కావిటీ 526, యూటీఐ 10, ల్యాబ్ 88, థైరాయిడ్ 56, విటమిన్ డీ 41, సీబీపీ 79, సూక్ష్మపోషకాలు 58 మందికి పరీక్షలు చేసి.. వీరిలో ఎనిమిది మందిని జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

ప్రాణాలు తీసిన హార్డ్‌డిస్క్

- యువకుని ఆత్మహత్య
- రాచర్లతిమ్మాపూర్‌లో విషాదం



బాబు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఓ పెళ్లి వీడియో ఉన్న హార్డ్‌డిస్క్ మిత్రులు ఇవ్వకుండా బెదిరింపులకు గురిచేయడంతో భయంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లో విషాదం నింపింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన కరికె బాబు(27) వీడియోగ్రాఫర్‌గా పనిచేస్తుండే వాడు. ఇటీవల ఓ పెళ్లి వీడియో చిత్రీకరించాడు. దానికి సంబంధించిన హార్డ్‌డిస్క్‌ను రాచర్లగొల్లపల్లికి చెందిన స్నేహితులు చింతల రోహిత్, దండెం లచ్చయ్యలకు ఇచ్చాడు. హార్డ్‌డిస్క్ తిరిగివ్వాలని బాబు కోరగా వారు తిరిగివ్వకపోగా బెదిరింపులకు గురిచేశారు. అంతేకాకుండా బాబును చంపుతామని బెదిరించడంతో మనస్తాపానికి గురైన బాబు పది రోజుల క్రితం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతునికి తల్లిదండ్రులు మణెమ్మ–దశరథం ఉన్నారు. మృతుని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.